
సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు
బుధవారం । 20 । ఆగస్టు । 2025



28161 క్యూసెక్కుల వరద

సోమశిల జలాశయానికి 28161 క్యూసెక్కుల వరద వస్తోంది. డెల్టాకు 1850, ఉత్తరకాలువకు 340, కండలేరుకు 8,600 క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రా)	రూ.1,02,130
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.9,221
మూడు శాతం జీఎస్టీతో	రూ.9,498
సవర (8 గ్రాములు)	రూ.75,984

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం 31.0 /25.6

జిల్లాలో అక్కడక్కడా ఆకాశం బుధవారం మేఘావృతమయ్యే అవకాశం ఉందని వాతావరణ అధికారులు తెలిపారు. గాలిలో తేమ 72 శాతంగా మంగళవారం నమోదైంది.

కార్పొరేటు యాజమాన్యాలు

▸▸ అనుమతుల్లేకుండానే కిండర్ గార్డెన్ స్కూళ్లు

- నోటీసుల జారీకే విద్యాశాఖ పరిమితం
- ఇదే బాటలో ప్రైమరీ, హైస్కూళ్ల నిర్వహణ
- ముందుగానే ముడుపులు పుచ్చుకున్న అధికారులు
- చర్యలకు వెనుకడుగు
- చక్రం తిప్పుతున్న ఎంఈఓ
- మంత్రి నారాయణ సేవలో తరిస్తూ..

కార్పొరేట్ శక్తులు విద్యను వ్యాపారంగా మార్చేశాయి. దీపం ఉండగానే ఇల్లు చక్కదిద్దుకుందామనే రీతిలో వ్యవహరిస్తూ.. తల్లిదండ్రుల ఆశలను చక్కగా క్యాష్ చేసుకుంటున్నాయి. ఇదే అదనుగా జిల్లాలో కిండర్ గార్డెన్ స్కూళ్లు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయి. రకరకాల పేర్లు పెట్టి ఫీజులను అమాంతంగా పెంచేసి దోచుకుంటున్నారు. అనుమతుల్లేకపోయినా పర్వాలేదు, తమకు ముడుపులిస్తే చాలు.. మీ ఇష్టారాజ్యమనే రీతిలో అనధికార ఆదేశాలను జిల్లా విద్యాశాఖ అధికారులు జారీ చేశారు. ఫలితంగా యాజమాన్యాలు ఆడిందే ఆట.. పాడిందే పాట చందంగా పరిస్థితి మారింది.



నెల్లూరు (టౌన్): జిల్లాలో కార్పొరేట్ పాఠశాలల యాజమాన్యాలు ధనదాహంతో అడ్డదారులు తొక్కుతున్నాయి. అందినకాడికి దండుకోవడమే లక్ష్యంగా వీరు చెలరేగిపోతున్నారు. పర్యవేక్షించాల్సిన విద్యాశాఖ అధికారులు అందుకు భిన్నంగా వ్యవహరిస్తున్నారు. మంత్రి నారాయణ సేవలో ఎంఈఓతో పాటు డీఈఓ నిమగ్నమయ్యారు. వారంలో రెండు రోజులు ఇక్కడే ఉండటంతో ఆయన చుట్టూ ప్రదక్షిణలు చేస్తూ, ఆలనాపాలనను గాలికొదిలేశారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి

జిల్లాలో ఇలా..

జిల్లాలో కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలలు 1040 ఉన్నాయి. ఇందులో 1.65 లక్షల మందికిపైగా విద్యార్థులు చదువుతున్నారు. వీటిలో నర్సరీ నుంచి పదో తరగతి వరకు నిర్వహిస్తున్నారు. మరోవైపు కిండర్ గార్డెన్ పేరుతో నర్సరీ, ఎల్కేజీ, యూకేజీ నిర్వహిస్తున్న స్కూళ్లు ప్రభుత్వ అనుమతిని విధిగా పొందాల్సి ఉంది. అయితే ఎలాంటి పర్మిషన్లను పొందకుండానే జిల్లాలో 650.. నగరంలోనే 250 స్కూళ్లను నిర్వహిస్తున్నారు. ఈ ఉదంతంపై ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్‌కు పేరెంట్స్ అసోసియేషన్ నేతలు జూన్‌లో ఫిర్యాదు చేశారు.

హడావుడి.. ఆపై నిర్లక్ష్యం

కలెక్టర్ ఆదేశాలతో సదరు పాఠశాలలకు నోటీసులను జారీ చేశారు. నెల్లో వివరణ ఇవ్వాలని అందులో పేర్కొన్నా, నేటికీ వారి నుంచి రాలేదని సమాచారం. అనుమతుల కోసం దరఖాస్తు చేసుకుంటున్నారంటూ జిల్లా విద్యాశాఖ అధికారులు తాజాగా సెలవిస్తున్నారు. అనుమతుల్లేకుండా నిర్వహిస్తున్నా, నేటికీ ఒక్క స్కూల్‌పై సైతం చర్యలు చేపట్టలేదంటేనే కార్పొరేట్ యాజమాన్యాలతో వారికి ఉన్న అనధికార ఒప్పందం ఏ పాటిదో అర్థం చేసుకోవచ్చు.

పొంతన లేని మాటలు

అన్నమయ్య సర్కిల్ సమీపంలో ఆరెన్నార్ స్కూల్‌ను నిర్వహిస్తున్నారు. ఒకటి నుంచి పదో తరగతి వరకు అనుమతి కోసం ప్రభుత్వానికి యాజమాన్యం దరఖాస్తు చేసిందని జిల్లా విద్యాశాఖ అధికారులు చెప్తున్నారు. తొలుత ప్రాథమిక తరగతుల వరకే అనుమతి పొందాల్సి ఉన్న తరుణంలో ఆర్జేడీ వద్ద పెండింగ్‌లో ఉందనీ పేర్కొంటున్నారు. మరోవైపు నిర్వహణకు అనుమతిచ్చారని, అయితే పెండింగ్‌లో ఉండటంతో ఇంకా ప్రభుత్వ గుర్తింపు రాలేదని ఎంఈఓ తిరుపాల్ చెబుతున్నారు. ఇలా పొంతన లేని మాటలు అనుమానాలకు తావిస్తోంది. ఇక్కడ తరగతులను మాత్రం యథేచ్ఛగా నిర్వహిస్తున్నారు. వీటితో పాటు పదుల సంఖ్యలో కార్పొరేట్ యాజమాన్యాలు అనుమతుల్లేకుండా ప్రాథమిక, హైస్కూళ్లను జరుపుతున్నారు.

పాఠశాలను బట్టి మామూళ్లు

అనుమతుల్లేని పాఠశాలలపై చర్యలు చేపట్టకుండా మామూళ్ల మత్తులో జిల్లా విద్యాశాఖ అధికారులు జోగుతున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. స్కూల్‌ను బట్టి రూ.50 వేల నుంచి రూ.రెండు లక్షల వరకు వసూలు చేస్తున్నారని సమాచారం. జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో పని చేస్తున్న సెక్షన్ అధికారి మొదలుకొని ఉన్నతస్థాయి అధికారుల వరకు వీటిని పంచుకుంటున్నారనే ఆరోపణలు లేకపోలేదు. నగరంలో ఎంఈఓ చక్రం తిప్పుతున్నారనే ప్రచారమూ ఉంది. ఇప్పటికైనా అనుమతి లేని పాఠశాలలపై కలెక్టర్ ఉక్కుపాదం మోపాలని పలువురు కోరుతున్నారు.

ఇప్పుడు దరఖాస్తు చేసుకుంటున్నారు

నగరంలో అనుమతుల్లేకుండా పాఠశాలలను నడుపుతున్న యాజమాన్యాలు ఇప్పుడు దరఖాస్తు చేసుకుంటున్నాయి. వీరికి ఇంతకు ముందే నోటీసులను జారీ చేశాం. నూతన విద్యా పాలసీ ప్రకారం కిండర్ గార్డెన్‌కూ అనుమతులు పొందాల్సిందే.

– తిరుపాల్, ఎంఈఓ

ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదు



అనుమతుల్లేని స్కూళ్లపై చర్యలు చేపట్టాలంటూ జిల్లా విద్యాశాఖాధికారులకు పలుమార్లు వినతిపత్రాలను అందజేసినా ప్రయోజనం లేదు. కార్పొరేట్ యాజమాన్యాల నుంచి మామూళ్లను భారీగా పుచ్చుకొని పూర్తి స్వేచ్ఛ ఇస్తున్నారు. అధిక ఫీజులు, పుస్తకాల పేరిట దోపిడీ జరుగుతున్నా, మిన్నకుండిపోతున్నారు. దీనిపై కలెక్టర్ జోక్యం చేసుకోవాలి.

– ఆదిత్యసాయి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఏపీ విద్యార్థి జేఏసీ

నోటీసులను మరోసారి జారీ చేస్తాం



అనుమతుల్లేకుండా పాఠశాలలను నిర్వహిస్తున్న యాజమాన్యాలకు గతంలో నోటీసులను జారీ చేసి వివరణ కోరాం. మరికొందరు పంపాల్సి ఉంది. మరోసారి నోటీసులను జారీ చేస్తాం. పాఠశాలలకు అనుమతి ఉండాల్సిందే.

– బాలాజీరావు, డీఈఓ

న్యూస్‌రీల్

సూర్యప్రభ వాహనంపై వెంకయ్యస్వామి విహారం



వెంకటాచలం: ఆరాధనోత్సవాల్లో భాగంగా గొలగమూడిలోని భగవాన్ వెంకయ్యస్వామి సూర్యప్రభ వాహనంపై మంగళవారం దర్శనమిచ్చారు. సుప్రభాతసేవ, అభిషేకాలను జరిపారు. చంద్రప్రభ వాహనసేవను రాత్రి నిర్వహించారు. స్వామివారిని పుష్పాలతో అలంకరించి గ్రామోత్సవాన్ని జరిపారు.

ఉత్సవాల్లో నేడు

ఉత్సవాల్లో భాగంగా హనుమంత, హంసవాహన సేవను బుధవారం నిర్వహించనున్నారు.

పొగాకు సగటు ధర రూ.196.62



మర్రిపాడు: మండలంలోని డీసీపల్లి పొగాకు బోర్డు వేలం కేంద్రంలో 184 బేళ్లను మంగళవారం విక్రయించామని వేలం నిర్వహణాధికారి రాజశేఖర్ తెలిపారు. సగటున రూ.196.62 ధర లభించింది. వేలానికి 336 బేళ్లు రాగా 184ను విక్రయించామని, మిగిలిన వాటిని వివిధ కారణాలతో తిరస్కరించామని తెలిపారు. వేలంలో 21,528.3 కిలోల పొగాకును విక్రయించారు. గరిష్ఠంగా రూ.280, కనిష్ఠంగా రూ.140 ధర లభించింది.

ఉన్నత విద్యకు ఉపకార వేతనాలు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): ఉన్నత విద్యనభ్యసించాలనే గిరిజన విద్యార్థులకు ఉపకార వేతనాలను నేషనల్ ఫెలోషిప్, నేషనల్ స్కాలర్‌షిప్ పథకాల ద్వారా అందజేస్తున్నారని ఐటీడీఏ పీఓ మల్లికార్జున మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పీజీలో 55 శాతం మార్కులతో ఉత్తీర్ణులైన గిరిజన విద్యార్థులు ఎంఫిల్, పీహెచ్‌డీ కోర్సులు చేసేందుకు ఎంపిక చేసిన యూనివర్సిటీల్లో ప్రవేశం పొందిన వారు నేషనల్ ఫెలోషిప్ స్కాలర్‌షిప్‌కు అర్హులని చెప్పారు.

- డిగ్రీ, పీజీ కోర్సులు చేసేందుకు ఎంపిక చేసిన కళాశాలలు, యూనివర్సిటీల్లో ప్రవేశం పొందిన వారు నేషనల్ స్కాలర్‌షిప్ పథకానికి అర్హులని వివరించారు. వీరి వార్షికాదాయం రూ.ఆరు లక్షలకు మించరాదన్నారు. ఆన్‌లైన్లో వచ్చే నెలాఖరులోపు దరఖాస్తు చేసుకోవాలని, వివరాలకు ఐటీడీఏ కార్యాలయాన్ని సంప్రదించాలని సూచించారు.

ఓపెన్ స్కూల్ ఫీజు గడువు పొడిగింపు

నెల్లూరు (టౌన్): ఓపెన్ స్కూల్లో పదో తరగతి, ఇంటర్‌లో ప్రవేశానికి రూ.200 అపరాధ రుసుముతో ఫీజు గడువును వచ్చే నెల 15 వరకు పొడిగించారని డీఈఓ బాలాజీరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల వారు ఫీజును ఆన్‌లైన్లో చెల్లించాలని, వివరాలకు 89194 28319 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

యథేచ్ఛగా గ్రావెల్ దందా



కావలి (జలదంకి): కావలి మండలంలోని చలంచర్లలో గ్రావెల్ అక్రమ దందా కొనసాగుతోంది. చెరువులో రెండు జేసీబీలతో తవ్వుతూ ట్రాక్టర్లలో తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. వివిధ ప్రాంతాలకు మంగళవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు తరలించారు. ఎలాంటి అనుమతుల్లేకుండా తెలుగు తమ్ముళ్లు ఇలా వ్యవహరిస్తున్నా.. ఇరిగేషన్ అధికారులు ఏ మాత్రం పట్టించుకోకపోవడం గమనార్హం.

కాకాణి విడుదలలో జాప్యం

- బెయిల్ మంజూరు పత్రాలివ్వడంలో ఆలస్యం
- కలిసేందుకు వేలాదిగా తరలివచ్చిన వైఎస్సార్‌సీపీ శ్రేణులు
- జైలు వద్దకు వెళ్లనీయకుండా పోలీసుల ఆంక్షలు



జైలుకెళ్లే మార్గంలో జాతీయ రహదారి పక్కన నిరీక్షిస్తున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు

వెంకటాచలం: మాజీ మంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డికి హైకోర్టు బెయిలిచ్చినా, మంజూరు పత్రాలను ఇవ్వడంలో ఆలస్యం చోటుచేసుకుంది. దీంతో జైలు నుంచి మంగళవారం ఆయన విడుదల కాలేకపోయారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కాకాణిపై ఎనిమిది అక్రమ కేసులను బనాయించి జైలుకు పంపారు. ఏడు కేసుల్లో ఇప్పటికే బెయిల్ లభించగా, తాజాగా మిగిలిన దాంట్లో సోమవారం మంజూరైంది. దీంతో నెల్లూరు కేంద్ర కారాగారం నుంచి మంగళవారం విడుదలవుతారని భావించారు. అయితే బెయిల్ మంజూరు పత్రాలను ఆలస్యంగా ఇవ్వడంతో అవి అధికారులకు సకాలంలో అందలేదు. దీంతో బుధవారం విడుదలయ్యే అవకాశం ఉంది.

అడుగడుగునా పోలీసుల ఆంక్షలు

తమ అభిమాన నేత కాకాణి గోవర్ధన్‌రెడ్డి విడుదలవుతారని తెలిసి సర్వేపల్లి నియోజకవర్గంలోని పార్టీ శ్రేణులు, అభిమానులే కాకుండా జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున నేతలు జిల్లా కేంద్ర కారాగారం వద్దకు చేరుకున్నారు. కొందరు తమ అభిమానాన్ని చాటుతూ జైలుకెళ్లే మార్గంలో కాకాణికి స్వాగతం పలుకుతూ ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. అయితే వీటిని తొలగించడమే కాకుండా జైలు వద్ద ఉన్న శ్రేణులను పోలీసులు చెదరగొట్టారు. కొందరు ఏదో మార్గంలో వెళ్తుంటే, ఖాకీలు అత్యుత్సాహంతో బైక్‌లను ఆపి తాళాలను లాక్కొన్నారు.

నిరాశగా వెనుదిరిగి..

చెముడుగుంట పంచాయతీ పవన్‌కాలనీ నుంచి బుజబుజనెల్లూరు వరకు నెల్లూరు వైపు వెళ్లే మార్గంలో వేలాది మంది పార్టీ శ్రేణులు కాకాణి రాక కోసం గంటల తరబడి వేచి చూశారు. చివరికి ఆయన విడుదల కావడంలేదని తెలిసి నిరాశగా వెనుదిరిగారు.

జాప్యం బాధాకరం

మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి మంగళవారం విడుదల కాకపోవడం బాధాకరమని ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. జిల్లా కేంద్ర కారాగారం వద్ద విలేకరులతో ఆయన మాట్లాడారు. ఆయనకు స్వాగతం పలికేందుకు ఎంతో సంతోషంగా జైలు వద్దకొచ్చామని, అయితే గూడూరు కోర్టు నుంచి 5.30 తర్వాత బెయిల్ మంజూరు పత్రాలివ్వడంతో విడుదల ఆలస్యమైందని చెప్పారు. అనంతరం కాకాణి కుమార్తె, పార్టీ మహిళా విభాగ వర్కింగ్ ప్రెసిడెంట్ పూజిత మాట్లాడారు. తన తండ్రి జైలుకెళ్లాక, ఏనాడూ ఇక్కడికి రాలేదని, ఈ రోజు విడుదలవుతున్నారనే సంతోషంతో రాగా, జాప్యం కావడం బాధగా ఉందని తెలిపారు. బెయిల్ మంజూరు పత్రాలను సకాలంలో కోర్టు వద్దకు చేర్చడంలో మా తప్పు లేకపోయినా, ఎప్పుడు విడుదలవుతారనే విషయమై స్పష్టత ఇవ్వడంలేదని తెలిపారు. బుధవారం ఏ సమయంలో విడుదల చేస్తారనే విషయమై సమాధానం చెప్పేవారే లేరని అసంతృప్తి వ్యక్తం చేశారు.



విడుదల్లో జాప్యంతో వెనుదిరుగుతున్న చంద్రశేఖర్‌రెడ్డి, పూజిత తదితరులు

నేడు బయటకు..

నెల్లూరు (లీగల్): జిల్లా కేంద్ర కారాగారం నుంచి మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి బుధవారం ఉదయం విడుదల కానున్నారు. హైకోర్టు ఉత్తర్వుల మేరకు ఆయన విడుదల కోసం రూ.రెండు లక్షల ఆస్తి కలిగిన ఇద్దరు జామీన్‌దార్లతో పత్రాలను గూడూరు ఇన్‌చార్జి అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో సీనియర్ న్యాయవాదులు రామిరెడ్డి రోజారెడ్డి, ఉమామహేశ్వర్‌రెడ్డి దాఖలు చేశారు. అయితే సాంకేతిక కారణాలతో కోర్టులో రిలీజ్ ఆర్డర్స్ ఆలస్యమయ్యాయి. జిల్లా కేంద్ర కారాగార నిబంధనల మేరకు రిలీజింగ్ ఆర్డర్స్‌కు సమయం మించిపోవడంతో మంగళవారం విడుదల కాలేకపోయారు.

భూముల ఆక్రమణపై విజిలెన్స్



పరిశీలిస్తున్న అధికారులు

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: పట్టణంలోని వవ్వేరులో గల కనిగిరి చెరువు వద్ద గ్రావెల్ అక్రమ తవ్వకాలు, భూముల ఆక్రమణపై విజిలెన్స్ అధికారులు మంగళవారం తనిఖీ చేశారు. కనిగిరి రిజర్వాయర్‌ను ఆనుకొని ఉన్న భూముల్లో గ్రావెల్ మాఫియా కొన్ని రోజులుగా ఇష్టారాజ్యంగా తవ్వేసింది. వీటిని విక్రయించి రూ.కోట్లు గడించడమే కాకుండా ఆయా భూములను చదును చేసి ఆక్రమించారు. ఈ విషయమై స్థానిక రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు పట్టించుకున్న దాఖలాల్లేవు. వ్యవహారం జిల్లా విజిలెన్స్ అధికారుల దృష్టికి వెళ్లడంతో.. కనిగిరి రిజర్వాయర్ వద్ద గ్రావెల్ తవ్విన ప్రదేశాలు, ఆక్రమణకు గురైన స్థలాలను పరిశీలించారు. 920 సర్వే నంబర్‌లో వందలాది ఎకరాలు అక్రమార్కుల చెరలో ఉన్నాయనే అంశాన్ని గుర్తించారు. గ్రామస్తులను అడిగి పలు వివరాలను సేకరించారు. ఈ సందర్భంగా విజిలెన్స్ అధికారులు మాట్లాడారు. భూముల ఆక్రమణ, గ్రావెల్ తవ్వకాలపై సమగ్ర నివేదికను రూపొందించి ఉన్నతాధికారులకు అందజేయనున్నామని చెప్పారు. సంబంధమున్న వారిపై చర్యలు తప్పవని పేర్కొన్నారు.

యూరియాకు కృత్రిమ కొరత సృష్టిస్తే చర్యలు



మాట్లాడుతున్న సత్యవాణి

దుత్తలూరు: జిల్లాకు ఈ సీజన్లో 40 వేల మెట్రిక్ టన్నుల యూరియా వచ్చిందని, ఎవరైనా కృత్రిమ కొరత సృష్టిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా వ్యవసాయాధికారి సత్యవాణి పేర్కొన్నారు. దుత్తలూరు బిట్ – 1 సచివాలయంలో మంగళవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా రైతులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. జామాయిల్ తోటలు సాగు చేసే వారికి యూరియాను ఇవ్వడంలేదని, వీరు కాంప్లెక్స్ ఎరువులను వినియోగించాలని సూచించారు. పంటలను పరిశీలించి అవసరమైన వారికి యూరియాను అందిచాలని కోరారు. ఈ – పంట నమోదు చేయించుకోవాలని, అన్నదాత సుఖీభవ పథకం అందని వారికి ఏమైనా సమస్యలుంటే రైతు సేవా కేంద్రంలో గ్రామ వ్యవసాయ సహాయకులను సంప్రదించాలని సూచించారు. ఉదయగిరి నియోజకవర్గానికి కందులు అందుబాటులో ఉన్నాయని, అవసరమైన రైతులు తమ సమీప కార్యాలయాలను సంప్రదించాలని పేర్కొన్నారు. మున్ముందు మినుములూ అందుబాటులోకి రానున్నాయని వెల్లడించారు. జిల్లా వ్యవసాయ కార్యాలయ ఏడీఏ నర్సోజీరావు, వ్యవసాయ శాస్త్రవేత్త కిరణ్‌కుమార్‌రెడ్డి, ఉదయగిరి ఏడీఏ లక్ష్మీమాధవి, వ్యవసాయాధికారులు వెంకటసుబ్బారెడ్డి, మదన్‌మోహన్, చెన్నారెడ్డి, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

అక్టోబర్ నాటికి ప్లాంటేషన్లు పూర్తి



చెక్క నగిషీ కేంద్రంలో మహబూబ్‌బాషా

ఉదయగిరి: జిల్లాలో ప్లాంటేషన్ ప్రక్రియను ఈ ఏడాది అక్టోబర్ నాటికి పూర్తి చేస్తామని జిల్లా అటవీ శాఖ అధికారి మహబూబ్‌బాషా పేర్కొన్నారు. పట్టణంలోని చెక్క నగిషీ కేంద్రాన్ని మంగళవారం పరిశీలించిన అనంతరం అక్కడి మహిళలు, నిర్వాహకులతో ముచ్చటించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడారు. జిల్లాలో ఐదు అటవీ రేంజ్‌ల పరిధిలో 960.48 హెక్టార్లలో మొక్కల పెంపకం లక్ష్యమన్నారు. నర్సరీల్లో 20.65 లక్షల మొక్కలను పెంచుతున్నామని వివరించారు. వర్షాల నేపథ్యంలో ఐదు అటవీ రేంజ్‌ల పరిధిలో మొక్కలు నాటేందుకు ప్లాంటేషన్లను సిద్ధం చేస్తున్నారని వివరించారు. ఇప్పటికే 60 హెక్టార్లలో మొక్కలు నాటడాన్ని పూర్తి చేశామన్నారు. చెక్క నగిషీ కేంద్రంలో వస్తువుల తయారీకి ఉపయోగించే వివిధ రకాల దేవదారు, కలివి, నెర్ది, బల్లనెర్ది కలప అందుబాటులో లేవని, వీటిని అటవీ శాఖ ప్లాంటేషన్లలో పెంచి తయారీదారులకు సరఫరా చేసేలా చర్యలు చేపడుతున్నామని పేర్కొన్నారు. ఈ వస్తువులకు మార్కెటింగ్ సౌకర్యాన్ని కల్పించనున్నామని, ఇందులో భాగంగా జిల్లాలోని నగరవనంలో స్టాళ్ల ఏర్పాటుకు కృషి చేస్తామని వెల్లడించారు. అనంతరం దుర్గంపల్లె నర్సరీ, సర్వరాబాద్ ప్లాంటేషన్‌ను పరిశీలించారు. రేంజ్ అధికారి కుమార్‌రాజా, ఎఫ్ఎస్ఓ చిన్న వెంకటయ్య, ఏబీఓ బచ్చల వెంకటేశ్వర్లు, కేంద్ర నిర్వాహకుడు జాకీర్‌హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

'బార్ టెండర్లలో పాల్గొనబోం'

- నెలకు రూ.పది లక్షల నష్టం తప్పదు
- బార్ యజమానుల అసహనం



నెల్లూరు సిటీ: కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన మద్యం పాలసీపై బార్ల యజమానులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఈ విధానంతో నెలకు రూ.పది లక్షల నష్టం వస్తుందని, ఈ తరుణంలో టెండర్లలో తాము పాల్గొనబోమంటూ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్‌కు లిఖితపూర్వకంగా మంగళవారం తెలిపారు. ఎన్నో ఏళ్లుగా ఈ రంగంలో ఉంటున్న తమకు నూతన లాటరీ విధానంతో నష్టం వాటిల్లుతుందని చెప్పారు. ప్రస్తుతం యజమానులుగా ఉన్న తాము లైసెన్స్‌లను పోగొట్టుకునే ప్రమాదం ఉందన్నారు.

ఎంత తేడా..

హైదరాబాద్ లాంటి నగరాల్లో ఏడాదికి రూ.40 లక్షల బార్ లైసెన్స్ ఫీజు, 22 శాతం మార్జిన్ ఉంటుందన్నారు. అయితే రాష్ట్రంలో ఏడాదికి రూ.75 లక్షల ఫీజుతో పాటు మూడేళ్ల కాలపరిమితి ఇవ్వడంతో తమకు వ్యాపార భద్రత కరువవుతుందని తెలిపారు. రూ.99 బ్రాండ్ ఇవ్వకపోతే తాము నష్టపోతామని, మద్యం దుకాణాలకు పర్మిట్ రూములను ఇవ్వడంతో కోలుకోలేని దెబ్బ తగులుతుందని చెప్పారు. గడిచిన ఏడాదే నగరంలో ఒక్కో బార్ యజమాని దాదాపు రూ.50 లక్షల నుంచి రూ.కోటి వరకు నష్టపోయిన అంశాన్ని ప్రస్తావించారు.

కూటమి నేతలకు 30 యాక్ట్ వర్తించదా?

• కరేడు రైతుల మండిపాటు


శంకుస్థాపనకు హాజరైన ఎమ్మెల్యే, టీడీపీ కార్యకర్తలు

ఉలవపాడు: కూటమి నేతలకు, కార్యకర్తలకు పోలీస్ 30 యాక్ట్, 144 సెక్షన్లు వర్తించవా? అని కరేడు రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కరేడు ర్యాంపు నుంచి కరేడు మీదుగా చేవూరు వరకు రూ.2.45 కోట్లతో నిర్మించనున్న బీటీ రోడ్డుకు మంగళవారం ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు శంకుస్థాపన చేశారు. సాధారణంగా శంకుస్థాపనను రోడ్డు మొదలయ్యే చోట ఏర్పాటు చేస్తారు. అలా కాకుండా కరేడు వద్ద చేశారు. ఊరిలో ఈనెల 31 వరకు పోలీస్ 30 యాక్ట్ ఉందని, బయట వ్యక్తులు రాకూడదని, 144 సెక్షన్ అమల్లో ఉందని పోలీసులు చ ఎప్పారు. అయితే ఈ కార్యక్రమానికి బయటి నుంచి వ్యక్తులు వచ్చినా చూస్తూ ఉండటంతో ఆంతర్యమేమిటని రైతులు ప్రశ్నిస్తున్నారు. భూములు కోల్పోతున్న వారికి అండగా వివిధ పార్టీల నాయకులు వస్తుంటే పోలీస్ శాఖ అడ్డుకుని అరెస్టు చేస్తూ నిర్బంధించింది. టీడీపీ కార్యకర్తలకు ఒక న్యాయం, రైతులకు ఒక న్యాయమా అని ఉద్యమ నాయకుడు, 139 బీసీ కులాల జేఏసీ చైర్మన్ మిరియం శ్రీనివాసులు ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. కాగా ఎమ్మెల్యే కరేడు, అలగాయపాళెం సచివాయాలను తనిఖీ చేసిన సమయంలో టీడీపీ కార్యకర్తలకే పనిచేయాలని సిబ్బందికి చెప్పినట్లు సమాచారం.

కండలేరులో 28.990 టీఎంసీలు

రాపూరు: కండలేరు జలాశయంలో మంగళవారం నాటికి 28.990 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ గజేంద్రరెడ్డి తెలిపారు. సోమశిల జలాశయం నుంచి కండలేరుకు 7,280 క్యూసెక్కుల నీరు చేరుతోందన్నారు. కండలేరు నుంచి సత్యసాయి గంగ కాలువకు 1,750, పిన్నేరు కాలువకు 30, లోలెవల్ కాలువకు 30, మొదటి బ్రాంచ్ కాలువకు 80 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు వెల్లడించారు.

పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్	: రూ.120
లేయర్	: రూ.118
బ్రాయిలర్ చికెన్	: రూ.220
స్కిన్‌లెస్ చికెన్	: రూ.244
లేయర్ చికెన్	: రూ.200

నిమ్మధరలు (కిలో)

పెద్దవి	: రూ.50
సన్నవి	: రూ.40
పండ్లు	: రూ.20

ప్రాణం చిన్నది.. ప్రమాదం పెద్దది

సమాజాన్ని వణికిస్తున్న దోమలు

• ఒక్కోదఫా ప్రాణాంతకంగా మారుతున్న జబ్బులు
• అవగాహన, జాగ్రత్తలతోనే నివారణ
• నేడు ప్రపంచ దోమల నివారణ దినం
• జిల్లాలో అవగాహన కార్యక్రమాలు



నెల్లూరు(అర్బన్): డెంగీ, మలేరియా, ఫైలేరియా, చికున్‌గున్యా.. ఇవి రావడానికి ప్రధాన కారణం దోమ కాటు. వర్షాకాలంలో వీటి బెడద విపరీతంగా ఉంటూ సమాజాన్ని వణికిస్తాయి. లక్షల మంది అనారోగ్యానికి గురవుతుంటారు. చికిత్స నిమిత్తం పెద్ద మొత్తంలో నగదు ఖర్చయి ఆర్థికంగా నష్టపోతున్న వారు కూడా ఉన్నారు. మరికొందరికి డెంగీ ప్రాణాంతకంగా మారుతోంది. ఇలాంటి సమయంలో ఆరోగ్యపరంగా అప్రమత్తంగా ఉండాలని ప్రపంచ ఆరోగ్య సంస్థ సూచిస్తోంది. బుధవారం దోమల నివారణ దినం సందర్భంగా జిల్లాలో కూడా వైద్యశాఖ ఆధ్వర్యంలో అధికారులు, సిబ్బంది అవగాహన ర్యాలీలు నిర్వహిస్తూ సదస్సులు నిర్వహించనున్నారు. మలేరియా నిర్మూలన కోసం పోరాటాన్ని వేగవంతం చేయడం, మరింత సమానమైన ప్రపంచం కోసం అనే థీమ్‌ను ఈ ఏడాది ప్రకటించారు.

విజృంభిస్తున్న వ్యాధులు

జిల్లాలో దోమలు ప్రజలను కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. సీజనల్ వ్యాధులతోపాటు ప్రమాదకరమైన జపనీస్ ఎన్సెఫలైటిస్, పసుపు జ్వరం, జికా వైరస్‌లు అప్పుడప్పుడూ ప్రజలపై దాడి చేస్తున్నాయి. ఈ జబ్బులకు గురైన పలువురు చికిత్సకు స్పందించక చనిపోతున్నారు. కొద్దిరోజులుగా చిరుజల్లులు కురుస్తూనే ఉన్నాయి. వర్షపునీరు ఖాళీ ప్రదేశాల్లో నిల్వ చేరింది. నెల్లూరు నగరంలో ఖాళీ ప్లాట్లు, మురుగు కాలువలు దోమలకు ఆవాసాలుగా మారాయి. ప్రభుత్వ, ప్రైవేట్ హాస్పిటళ్లలో జ్వరపీడితుల సంఖ్య పెరిగింది.

అలా వస్తేనే..

జిల్లాలో 52 పీహెచ్‌సీలు, 10 సీహెచ్‌సీలు, 28 పట్టణ ఆరోగ్య కేంద్రాలు, ఒక జిల్లా ఆస్పత్రి, రెండు ఏరియా ఆస్పత్రులు, నగరంలో మెడికల్ కళాశాలకు అనుబంధంగా సర్వజన ఆస్పత్రి ప్రభుత్వ ఆధ్వర్యంలో నడుస్తున్నాయి. 450 వరకు కార్పొరేట్, ప్రైవేట్ ఆస్పత్రులు, క్లినిక్‌లు నడుస్తున్నాయి. అన్నిచోట్లా రోగులు పెరుగుతున్నారు. రామచంద్రారెడ్డి, జయభారత్, నారాయణ, మెడికవర్ ఇలా పలు హాస్పిటళ్లలో డెంగీ కేసులు క్రమేపీ పెరుగుతున్నాయి. అయితే ప్రైవేట్‌లో చేసే పరీక్షలను వైద్యశాఖ అంగీకరించడం లేదు. ప్రభుత్వాస్పత్రిలో చేసే ఎలీసా టెస్ట్‌ల్లో పాజిటివ్ వస్తేనే డెంగీ లాంటి జబ్బులను అంగీకరిస్తున్నారు. దీంతో వైద్యశాఖలో డెంగీ, మలేరియా కేసులు లేనట్టు.. ఒకటో రెండో వచ్చినట్టు కాకి లెక్కలు రాస్తున్నారు. గత సంవత్సరంలో డెంగీ 130, మలేరియా 6, చికున్‌గున్యా 2 కేసులు నమోదయ్యాయి. ఈ ఏడాదిలో జూలై నెల వరకు డెంగీ 19, మలేరియా 3, చికున్‌గున్యా 2 కేసులు వచ్చినట్లు అధికారులు చెబుతున్నారు.

తీసుకోవాల్సిన చర్యలు

ఇంట్లో, ఆవరణలో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలి. పాత టైర్లు, పూలకుండీలు, డ్రమ్ములు వంటి వాటిలో నీరు ఉంటే పారబోయాలి. మురికి కూపాలు, చెత్తాచెదారం లేకుండా చూసుకోవాలి. ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి. ఇంట్లోకి దోమలు రాకుండా కిటికీలకు జాలీలు ఏర్పాటు చేసుకోవాలి. దోమతెరలు వాడాలి. దోమల నియంత్రణకు స్ప్రేలు వినియోగించాలి. అలాగే తులసి, వేప లాంటి మొక్కలను పెంచడం ద్వారా కొంతమేరకు దోమలను తగ్గించుకోవచ్చు.

అవగాహన పెంచాలి



దోమలు నివారణ జరగాలంటే ప్రజల్లో అవగాహన పెంచాలి. వాటి ద్వారా వచ్చే డెంగీ లాంటి జబ్బుల్లో కొన్ని రకాలు ప్రమాదకరంగా మారే అవకాశం ఉంది. చికిత్సకే రూ.లక్షలు ఖర్చు చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. అందువల్ల ప్రజలు ఇంట్లో, బయట నీరు నిల్వ లేకుండా చూసుకోవాలి. దోమలు రాకుండా మెస్‌లు ఏర్పాటు చేయించుకోవాలి.

– డాక్టర్ ఎంవీ రమణయ్య, ప్రజారోగ్యవేదిక రాష్ట్రాధ్యక్షుడు

చర్యలు తీసుకున్నాం



జిల్లాలో దోమల నిర్మూలనకు పెద్ద ఎత్తున కార్యక్రమాలు చేపట్టాం. అన్ని హాస్టళ్లలో మలాథియాన్ స్ప్రే చేశాం. నీటి గుంతల్లో దోమ లార్వాలను తినే గంబూసియా చేపలను వదిలిపెడుతున్నాం. ఫ్రైడే డ్రైడే కార్యక్రమంలో భాగంగా ఆశా కార్యకర్తలు, ఏఎన్‌ఎంలు, హెల్త్ అసిస్టెంట్లు ప్రజల వద్దకు అవగాహన కల్పిస్తున్నారు. ఎక్కడైనా మలేరియా, డెంగీ కేసులు నమోదైనట్టు తెలిస్తే ఆ ప్రాంతానికి చుట్టుపక్కల కిలోమీటర్ పరిధిలో పారిశుధ్య కార్యక్రమాలు చేపడుతున్నాం.

– హుస్సేనమ్మ, జిల్లా మలేరియా నివారణాధికారిణి

సకాలంలో వ్యవసాయ సర్వీసుల మంజూరు

• నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు
• ఏపీఎస్పీడీసీఎల్ సీఎండీ సంతోషరావు


మాట్లాడుతున్న సీఎండీ సంతోషరావు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): 'పెండింగ్‌లో ఉన్న వ్యవసాయ విద్యుత్ సర్వీసులను వెంటనే మంజూరు చేయాలి. రైతులు, వినియోగదారులను కార్యాలయాల చుట్టూ తిప్పుకునే పద్ధతికి స్వస్తి పలకాలి' అని ఏపీఎస్పీడీసీఎల్ సీఎండీ సంతోషరావు అన్నారు. జిల్లాలోని కావలి పట్టణంలో స్పందన ఫంక్షన్ హాల్లో మంగళవారం కావలి డివిజన్ విద్యుత్ అధికారులు, సిబ్బందితో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఐవీఆర్ఎస్ ద్వారా విద్యుత్ శాఖ వినియోగదారుల నుంచి ఫీడ్‌బ్యాక్ తీసుకోవడంలో కావలి డివిజన్‌లోని బోగోలు, కావలి రూరల్ సెక్షన్ల పనితీరు బాగోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యుత్ సరఫరా నిరంతరాయంగా జరుగుతుందా?, లోఓల్టేజీ సమస్యలు ఉన్నాయా?, సిబ్బంది అందుబాటులో ఉంటున్నారా? అనే మూడు ప్రధాన అంశాలపై ప్రభుత్వం వినియోగదారుల నుంచి ఫీడ్‌బ్యాక్ తీసుకుంటుందన్నారు. అయితే బోగోలు, కావలి రూరల్ సెక్షన్ల నుంచి వినియోగదారులకు సంతృప్తికర సేవలు అందడంలేదన్న ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. ఈ విషయంలో పురోగతి లేకపోతే సంబంధిత అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అదేవిధంగా పీఎం సూర్యఘర్‌కు సంబంధించి ఎస్సీ, ఎస్టీ వినియోగదారులకు యుద్ధప్రాతిపదికన అంగీకారపత్రాలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లాలో ఆర్డీఎస్ఎస్ స్కీమ్ ద్వారా గ్రామీణ విద్యుత్ మౌలిక వసతుల అభివృద్ధి, పారిశ్రామికీకరణ కోసం రూ.400 కోట్ల వ్యయంతో పనులు జరుగుతున్నాయన్నారు. నూతనంగా 336 వ్యవసాయ ఫీడర్లను ఏర్పాటు చేస్తున్నామన్నారు. అధికారులు, సిబ్బంది హెడ్‌క్వార్టర్స్‌లోనే నివాసం ఉండాలని, లేకపోతే హెచ్‌ఆర్‌ఏ కట్ చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో ఏపీఎస్పీడీసీఎల్ చీఫ్ జనరల్ మేనేజర్ వరకుమార్, జిల్లా సర్కిల్ ఎస్ఈ విజయన్, కావలి ఈఈ బెనర్జీ, డీఈఈ, ఏఈలు, సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

24న సాఫ్ట్‌బాల్ జట్టు ఎంపిక

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 24వ తేదీన నెల్లూరులోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో సీనియర్ మహిళా సాఫ్ట్‌బాల్ జట్టు ఎంపిక జరుగుతుందని ఆ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు మలిరెడ్డి కోటారెడ్డి, సీహెచ్ కామేశ్వరి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన జట్టు ఈనెల 30, 31 తేదీల్లో పల్నాడు జిల్లాలో జరిగే అంతర్రాష్ట్ర పోటీల్లో పాల్గొంటుందన్నారు. వివరాలకు 97036 54315, 80742 99640 ఫోన్ నంబర్లను సంప్రదించాలని కోరారు.

సీపీఐ జిల్లా కార్యదర్శిగా నాగేంద్రసాయి


నాగేంద్రసాయి

నెల్లూరు(వీఆర్సీసెంటర్): సీపీఐ జిల్లా 26వ మహాసభలు నెల్లూరు నగరంలో మూడురోజులు జరిగాయి. ఆ పార్టీ జిల్లా కార్యదర్శిగా అరిగెల నాగేంద్రసాయిని అధిష్టానం నియమించింది. ఈయన నగర కార్యదర్శిగా, నెల్లూరు అర్బన్ బ్యాంక్ చైర్మన్‌గా ఉన్నారు. జిల్లా సహాయ కార్యదర్శులుగా నందిపోగు రమణయ్య, మధు, కమిటీ సభ్యులుగా దామా అంకయ్య, పి.మాలకొండయ్య, కె.వినోదిని, సిరాజ్, షాన్‌వాజ్, నాగరాజు, సురేష్ శంకర్ కిశోర్, చిన అంకయ్య, ఆహ్వానితులుగా ఎస్‌కే మున్నా, ఎస్‌కే మస్తాన్ నియమితులయ్యారు.

18 మద్యం బాటిళ్ల స్వాధీనం

దుత్తలూరు: మండలంలోని భైరవరంలో నిర్వహిస్తున్న మద్యం బెల్టు షాపుపై ఉదయగిరి ఎక్సైజ్ ఎస్సై దీప్తి కరంత్ మంగళవారం తన సిబ్బందితో కలిసి దాడులు చేశారు. ఈ సందర్భంగా 18 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. నిర్వాహకుడు మధును అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసి కోర్టుకు హాజరుపరుస్తామని ఆయన తెలిపారు.

స్కాలర్‌షిప్‌ల కోసం దరఖాస్తుల ఆహ్వానం

నెల్లూరు రూరల్: దీన్‌దయాళ్ స్పర్శ యోజన (ఫిలాటిలీ స్కాలర్‌షిప్) కింద విద్యార్థుల నుంచి స్కాలర్‌షిప్‌ల కోసం దరఖాస్తులను కోరుతున్నామని పోస్టల్ సూపరింటెండెంట్ కె.శ్రీనివాస్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గుర్తింపు పొందిన పాఠశాలల్లో 6, 7, 8, 9 తరగతులు చదువుతుండాలన్నారు. విద్యార్థికి ఇటీవల రాసిన ఫైనల్ పరీక్షల్లో 60 శాతం మార్కులు లేదా దానికి సమానమైన గ్రేడ్ వచ్చి ఉండాలన్నారు. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు మార్కుల్లో రాయితీ ఉన్నట్లు తెలియజేశారు. మొదటి దశలో రీజినల్ స్థాయిలో రాతపరీక్ష జరుగుతుందని, అందులో ఉత్తీర్ణులైన వారు రెండో దశకు చేరుకుంటారన్నారు. వారికి క్విజ్ ప్రోగ్రాం నిర్వహిస్తామన్నారు. అర్హత సాధించిన వారు ఫిలాటెలీ ప్రాజెక్ట్‌ను సమర్పించాల్సి ఉంటుందన్నారు. మొదటిదశ రాత పరీక్షకు దరఖాస్తులను వచ్చే నెల 16వ తేదీలోగా పంపాలన్నారు. వివరాలకు సమీపంలోని పోస్టాఫీస్‌ను సంప్రదించాలని తెలియజేశారు.

అంగన్‌వాడీ సరుకులు తరలిస్తుండగా..

• పట్టుకున్న గ్రామస్తులు
• వేరేచోట భద్రపరిచేందుకన్న కార్యకర్త


పట్టుకున్న సరుకులు, కోడిగుడ్లు

పొదలకూరు: పట్టణానికి సమీపంలోని తెలుగుగంగ పునరావాస కేంద్రం(వెంకటేశ్వరనగర్) అంగన్‌వాడీ కేంద్రంలోని పిల్లలకు చెందిన సరుకులను మంగళవారం కార్యకర్త తరలిస్తుండగా గ్రామస్తులు పట్టుకుని సీడీపీఓ దృష్టికి తీసుకెళ్లారు. గ్రామస్తుల కథనం మేరకు.. కార్యకర్తగా పనిచేస్తున్న సునీత పిల్లలకు అందజేయాల్సిన కోడిగుడ్లు, బాలామృతం తదితర సుమారు రూ.15 వేలు విలువైన సరుకులను తరలిస్తుండగా అటకాయించారు. ఆటోతో సహా నిలిపివేసి పోలీసులకు అప్పగించాలని ప్రయత్నించినట్టు తెలిసింది. అయితే సరుకులను అక్కడే ఉంచి వెంకటాచలం సీడీపీఓకు సమాచారం అందించారు. అంగన్‌వాడీ టీచర్ మాత్రం సరుకులను వేరే ఇంట్లో భద్రపరిచేందుకు తరలిస్తుండగా పట్టుకున్నట్టు చెప్పుకొస్తున్నారు. సీడీపీఓ విచారణలో వాస్తవాలు తెలియాల్సి ఉంది.

టూరిజం భవనాల పరిశీలన


వివరాలు తెలుసుకుంటున్న అధికారులు

ఉదయగిరి: పట్టణంలోని ఆనకట్ట సమీపంలో నిర్మించిన ఏపీ టూరిజం శాఖ భవనాలను జిల్లా పర్యాటక శాఖ మేనేజర్ ఉషశ్రీ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పర్యాటక శాఖకు సంబంధించిన భవనాలను ఇటీవల టెండర్ ద్వారా అద్దె ప్రాతిపదికన ఎస్.తులసీరామ్ అనే వ్యక్తికి అప్పగించామన్నారు. దీంతో భవనాల మరమ్మతు పనులు ఎంత మేర జరిగాయో క్షేత్రస్థాయిలో పరిశీలన చేసేందుకు వచ్చినట్లు వివరించారు. పనులు పూర్తయిన వెంటనే ఆయా భవనాల్లో అతిథి గృహం, రెస్టారెంట్ అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ అప్పాజీ, ఎక్సైజ్ ఎస్సై శ్రీనివాసులు పాల్గొన్నారు.

బంగారం, నగదు చోరీ

నెల్లూరు సిటీ: ఇంట్లో అందరూ నిద్రిస్తున్న సమయంలో దొంగలు చొరబడి బంగారం, నగదు చోరీ చేశారు. మంగళవారం పోలీసులకు బాధితులు ఫిర్యాదు చేశారు. సుందరయ్య కాలనీలో సచివాలయ వెల్ఫేర్ సెక్రటరీ జి.చిరంజీవి కుటుంబం నివాసం ఉంటోంది. ఈనెల 6వ తేదీన కుటుంబ సభ్యులు నిద్రిస్తున్న సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు ఇంట్లోకి ప్రవేశించారు. సెల్‌ఫోన్లు తీస్తుండగా అలికిడి కావడంతో ఇంట్లోని వారు లేచి కేకలు వేశారు. దొంగలు అక్కడి నుంచి పరారయ్యారు. బీరువాలోని బంగారు ఉంగరాలు, రూ.3,500 నగదు చోరీకి గురైనట్లు గుర్తించారు. బాధితుడు వేదాయపాళెం పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

స్టాఫ్ నర్సుల విధుల బహిష్కరణ



ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి వద్ద ధర్నా చేస్తున్న స్టాఫ్ నర్సులు

నెల్లూరు(అర్బన్): మేల్ నర్సు వెంకటప్పయ్యపై దాడి చేసిన జూనియర్ డాక్టర్ శ్రీతేజ తదితరులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని పలువురు స్టాఫ్ నర్సులు డిమాండ్ చేశారు. మంగళవారం వారు విధులను బహిష్కరించారు. నగరంలోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి వద్ద ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా కాంట్రాక్ట్ స్టాఫ్ నర్సింగ్ అసోసియేషన్ సమన్వయకర్త మాధురి మాట్లాడుతూ నాలుగు రోజుల క్రితం క్యాజువాలిటీలో రద్దీగా ఉండటంతో రోగికి వైద్యం త్వరగా చేయాలని శ్రీతేజను వెంకటప్పయ్య కోరాడన్నారు. ఈ క్రమంలో వచ్చిన స్వల్ప విభేదాలను దృష్టిలో ఉంచుకుని వెంకటప్పయ్య డాక్టర్‌కు క్షమాపణ చెప్పాడన్నారు. అయినా శిక్షణలో ఉన్న 15 మంది జూనియర్ డాక్టర్లను వెంట బెట్టుకుని మద్యం మత్తులో శ్రీతేజ సోమవారం రాత్రి విధుల్లో ఉన్న వెంకటప్పయ్యను తిడుతూ దాడి చేశాడన్నారు. అడ్డుపడిన కల్యాణ్ అనే మరో నర్సుపై దాడి చేశారన్నారు. సీనియర్ స్టాఫ్ నర్సు శాంతిని తోసేసి బెదిరించారన్నారు. సూపరింటెండెంట్ డాక్టర్ మాధవికి ఫిర్యాదు చేసినా న్యాయం జరగలేదన్నారు. ఎమర్జెన్సీ మినహా మిగిలిన చోట్ల విధులు బహిష్కరించి న్యాయం జరిగే వరకు ఆందోళన చేస్తామన్నారు.

కేసు నమోదు

స్టాఫ్ నర్సులు నాలుగో నగర పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు శ్రీతేజ, సందీప్, దినేష్, గగన్, భార్గవ్‌పై ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. కాగా క్రిమినల్ కేసులు నమోదు చేయాలని నర్సులు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో స్టాఫ్ నర్సులు శాంతి, శ్రీలత, లావణ్య, వసుంధర తదితరులు పాల్గొన్నారు.

రక్షణ కల్పించాలి

శిక్షణలో ఉన్న ఒక జూనియర్ డాక్టర్ మేల్ నర్సుపై దాడి చేయడం బాధాకరం. ఇప్పటి వరకు బయటి వ్యక్తులతో ఇబ్బందులుండేవి. ఆస్పత్రిలోని జూడా దాడి చేస్తే ఇక తమకు రక్షణ ఎలా ఉంటుంది. రక్షణ కల్పించేంతవరకు ఆందోళన చేస్తాం.

– స్పందన

అండగా ఉంటాం

రోగులకు సేవలు చేసే నర్సులపై దాడి చేయడం దారుణం. మే నెలలో కూడా బ్లడ్‌బ్యాంక్‌లో ఓ నర్సును ఇదే జూనియర్ డాక్టర్ బెదిరించాడు. నర్సుల పోరాటానికి అండగా ఉంటాం. అధికారులు విచారించాలి.

– వరలక్ష్మి, ఏపీ ఎన్జీఓ రాష్ట్ర నేత

భయంతో విధులెలా?

డ్యూటీలో ఉన్న నర్సులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. దాడులు చేస్తుంటే భయంతో ఎలా విధులు నిర్వర్తించగలం. అధికారులు స్పందించి రక్షణ కల్పించడంతోపాటు దాడులకు కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలి.

– లావణ్య

ఉదయగిరిలో ఈదురుగాలుల బీభత్సం


తెగిపోయిన విద్యుత్ తీగ

ఉదయగిరి: ఉదయగిరి పట్టణంలో వారంరోజులుగా ఈదురుగాలులు బీభత్సం సృష్టిస్తున్నాయి. దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. గాలికి మంగళవారం పట్టణ సమీపంలోని స్టేట్‌పేటలో విద్యుత్ తీగ తెగి పడిపోగా త్రుటిలో ప్రమాదం తప్పింది. స్థానికులు గమనించి విద్యుత్ శాఖ అధికారులకు సమాచారం ఇవ్వడంతో వారు దానిని తొలగించి లైను సరిచేశారు. చెట్లకొమ్మలు, హోర్డింగులు నేల వాలిపోతున్నాయి. గాలులకు ఎలాంటి ప్రమాదాలు సంభవిస్తాయోనని ప్రజలు భయాందోళన చెందుతున్నారు.

29న శ్రీవారికి చందనాలంకారం

రాపూరు: మండలంలోని పెంచలకోనలో పెనుశిల లక్ష్మీనరసింహ స్వామి 29వ తేదీన చందనాలంకరణలో దర్శనమివ్వనున్నట్లు దేవస్థాన అధికారులు మంగళవారం తెలిపారు. ఆరోజు స్వాతి నక్షత్రం స్వామి జన్మ నక్షత్రం కావడంతో ఉదయం 4 గంటలకు సుప్రభాతం, 9 గంటలకు శాంతి హోమం, 10 గంటలకు కల్యాణం, రాత్రి 7 గంటలకు బంగారు గరుడ సేవ నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

చేప పిల్లల ఉత్పత్తి కేంద్రం పరిశీలన



సోమశిల: అనంతసాగరం మండల పరిధిలోని సోమశిల గ్రామంలో ఉన్న జాతీయ చేప పిల్లల ఉత్పత్తి కేంద్రాన్ని మత్స్యశాఖాధికారి సురేష్ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుపయోగంలో ఉన్న ఈ కేంద్రాన్ని ప్రారంభించేందుకు జంగిల్ క్లియరెన్స్‌కు ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందన్నారు. ఈ ఏడాది చివరన ఉత్పత్తి చేసిన చేప పిల్లలను సోమశిల జలాశయంలో వదులుతామన్నారు. ఆయన వెంట మత్స్యశాఖ సిబ్బంది ఖలీల్, లోకేశ్ ఉన్నారు.